

92.73% మందికి పింఛన్లు పంపిణీ



అనకాపల్లిలో పింఛన్ డబ్బులు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్టోబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఒకటో తేదీన 92.73 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. జిల్లాలో మొత్తం 2,57,322 మంది పింఛన్‌దారులు వుండగా, బుధవారం సాయంత్రానికి 2,38,615 మందికి డబ్బులు పంపిణీ చేశారు. మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో పంపిణీ చేస్తామని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు.



మహిషాసురమర్దిని అలంకరణలో అనకాపల్లి సతకంపట్టు కనకదుర్గమ్మ

మహిషాసురమర్దిని అవతారంలో దుర్గాదేవి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గాదేవి అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు షడ్భుజాల్లో వివిధ రకాల ఆయుధాలు ధరించి, మహిషాసురుడిని సంహరిస్తున్నట్టు ఆకట్టుకునేలా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వరిపై సుడిదోమ దాడి!



వరిపైరును ఆశించిన సుడి దోమ, తెల్లవీపు మచ్చదోమ

ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) రకానికి ఎక్కువ బెడద

- వరి దుబ్బుల వద్ద గుంపులుగా దోమలు
- రసం పీల్చేయడంతో పసుపు రంగులోకి మారిపోయి ఎండుతున్న ఆకులు
- వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారుల సూచన



చీడికాడ మండలం మంచాలలో సుడిదోమ ఆశించడంతో పసుపు రంగులోకి మారిన వరి ఆకుల చివర్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వరి పైరుపై సుడిదోమ ప్రభావం తీవ్రంగా ఉంది. దుబ్బు కడుతున్న తరుణంలో వందలాది ఎకరాల్లో వరిపైరును సుడిదోమ, తెల్లవీపు మచ్చ దోమలు ఆశించాయి.. దోమపోటుతో వరి ఆకులు పసుపు రంగులోకి మారి కొద్ది రోజుల్లో ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాగా వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగానే సుడిదోమ వ్యాప్తి చెందుతున్నదని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో వెంటనే మందులను పిచికారీ చేసి సుడిదోమ బెడదను నివారించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్ రావు తెలిపారు.

సుడిదోమ తెగులు లక్షణాలు, నివారణ చర్యలు

అధిక తేమతో కూడిన వాతావరణం, మోతాదుకు మించి యూరియా వాడడం, దమ్ము సరిగా చేయకపోవడం, గట్లపై కలుపు మొక్కలు పెరిగిపోవడం వంటి కారణాల వల్ల వరి పైరును సుడిదోమ, తెల్లవీపుమచ్చ దోమలు ఆశిస్తుంటాయి. ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) వరి రకానికి ఎక్కువగా ఈ దోమలు ఆశించినట్టు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. బీపీటీ 5204 (సాంబ మసూరి) రకానికి తక్కువగా దోమ ఆశించింది. ఎంటీయూ 1062 (ఇంద్ర) రకానికి దోమ ప్రభావం పెద్దగా లేదు. సుడిదోమలు వరి దుబ్బుల అడుగు భాగంలో చేరి, రసాన్ని పీల్చడం వల్ల ఆకులు పసుపురంగులోకి మారి ... మిగతా 10వ పేజీలో



వైద్య కళాశాలలపై వైసీపీ దుష్ప్రచారం



భీమబోయినపాలెంలో వృద్ధునికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

జీవోలు ఉంటే చూపించండి

- గత పాలకులకు స్పీకర్ అయ్యన్న సవాల్

మాకవరపాలెం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ఏర్పాటు విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్య పెట్టిందని, వైద్య కళాశాలలు తీసుకువచ్చినట్టు జీవోలు ఏమైనా వుంటే చూపించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సవాల్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని భీమబోయినపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఎన్ఎంసీ అనుమతులు ఇవ్వకుండానే వైద్య కళాశాలల్లో విద్యార్థులకు అడ్మిషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీకి సంబంధించి ఎటువంటి జీవో జారీ చేయకుండా ఈ మండలంలో రైతుల నుంచి భూములు తీసుకున్నారని ఆరోపించారు. ఆర్థికంగా ఎన్ని కష్టాలు వున్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 63,50,765 మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ నందకిశోర్, ఆర్‌డీవో వీవీ రమణ, తహశీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ ఛాయసుధ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఈదురు గాలులతో భారీ వర్షం

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

- మరోసారి నిండిన 'కల్యాణపులోవ'





ఇది చెరువు కాదు.. డి.సురవరం వద్ద రోడ్డుపై వర్షం నీటితో నిండిపోయిన భారీ గొయ్యి. (ఇన్‌సెట్‌లో) అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనదారులు

మాడుగుల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మధ్యాహ్నం తరువాత సుమారు రెండు గంటలపాటు ఈదురు గాలులతో కుండపోతగా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వరిపొలాలు పూర్తిగా నిండిపోయి గట్ల మీదుగా నీరు పొర్లి ప్రవహించింది. వడ్డాది- పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలుచోట్ల గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డు జంక్షన్ దాటిన తరువాత డి.సురవరం వద్ద రహదారిపై ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరి పంట కుంటలుగా దర్శనమిచ్చాయి. ఎంత లోతు వుంటుందో అంచనా వేయలేక పలువురు ద్విచక్ర వాహనదారులు పక్కన వున్న ప్రైవేటు స్థలాల్లో నుంచి వెళ్లాల్సి వచ్చింది. గోతుల వద్ద వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో ప్రయాణ సమయం రెట్టింపు అయ్యిందని పలువురు వాపోయారు.కాగా మండలంలో పెద్దేరు జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా బుధవారం 245 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.6 మీటర్లకు చేరింది. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో స్పిల్‌వేలో ఒక గేటు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని పెద్దేరు నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ సుధాకర రెడ్డి తెలిపారు.

రోలుగుంటలో..

రోలుగుంట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం తరువాత ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఎంకే పట్నం పంచాయతీ పెదపేటలో చెట్లు కూలి విద్యుత్ వైర్లపై పడడంతో స్తంభాలు ... మిగతా 10వ పేజీలో



రోలుగుంట మండలం పెదపేటలో విద్యుత్ వైర్లపై కూలిన చెట్లు. తీగలను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది





విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా, గణబాబు

ముఖ్యమంత్రికి ఆత్మీయ స్వాగతం

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విమానాశ్రయంలో కూటమి నేతలు, అధికారులు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 11 గంటలకు విశాఖ చేరుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.గణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు సీఎంకి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం 11.30 గంటలకు ఆయన హెలికాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లాకు వెళ్లారు.



రోగులకు మెరుగైన సేవలు

» డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

మునగపాక, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి ఆదేశించారు. చూచుకొండ పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. ఓపీ వివరాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అక్కడ నిర్వహించి వయోవృద్ధుల దినోత్సవానికి హాజరై మాట్లాడారు. సకాలంలో చక్కని ఆహారం తీసుకుంటూ, ఆనందంగా గడపాలన్నారు. వైద్యాధికారులు వై.రామకృష్ణ, లక్ష్మి, నారాయణ పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

» రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ అన్నారు. మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో గత ఏడాది విద్యుదాఘాతంతో బసన బోయిన పోతురాజు మృతి చెందగా, అతని తల్లిదండ్రులు అప్పారావు, అర్జమ్మలకు విద్యుత్ శాఖ మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదోళ్ల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిన శ్రీనువాస్, బి.గోవింద్, పి.సన్యాసమ్మ, పిల్లి శ్రీను, జి.అప్పన్న, శ్రీను, దుర్గ, జ్యోతిబాబు, చంటి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు

రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ


జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రగడ

రాంబిల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగనుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. లాలంకోడూరులో బుధవారం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల అన్ని రకాల వస్తువుల ధరలు తగ్గుతున్నాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు లాలం భరత్, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నరసింగరావు, మాజీ సర్పంచ్ లాలం సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మామిడివాడలో మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత జీఎస్టీ సంస్కరణలను గ్రామస్థులకు వివరించారు. అనంతరం ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు మాజీ సర్పంచ్ నానేపల్లి సాయివర ప్రసాద్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'మత్స్యకారులపై వైసీపీది కపట ప్రేమ'

పాయకరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుపై వైసీపీ నేతలది కపట ప్రేమ అని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, చిక్కాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కాకినాడలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటును అక్కడ ప్రజలు వ్యతిరేకిస్తే, దాన్ని ఇక్కడికి తరలించారని, ఆ సమయంలో వైసీపీ నేతలు సంబరాలు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆందోళన చేస్తున్న మత్స్యకారులకు మద్దతు పలకడం వారి ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. మత్స్యకారులను రెచ్చగొట్టే చర్యలు మానుకుని ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే పీఏసీఎస్ చైర్‌పర్సన్ డి.రాజబాబు మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పరిశ్రమ కావాలని ప్రకటనలు చేసిన వైసీపీ నేతలు కంటే ఊసరవెల్లి నయమనిపిస్తోందన్నారు. పార్టీ నేతలు వై.వరహాలబాబు, డి.ఆనంద్, జి.నాగు, సత్తిబాబు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్‌ను రద్దు చేయకపోతే ఉద్యమం

నక్కపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని 33 మత్స్యకార గ్రామ సంఘాల అధ్యక్షుడు చొక్కా అప్పారావు హెచ్చరించారు. బల్క్‌డ్రగ్ వ్యతిరేక ఆందోళనకు బుధవారం సంఘీబావం ప్రకటించారు. ఆయన వెంట మత్స్యకార నేతలు యజ్జల సూరిబాబు, రాజు, బొంది నాగేశ్వరరావు, సీపీఎం శ్వేత ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

పాయకరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పి.చిట్టిబాబు అన్నారు. పట్టణంలో బుధవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థమాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, నాయకులు జి.శ్రీనివాసరావు, జె.ప్రసాద్, ఎ.దొర, వై.సన్న, జి.నాగు, కె.సత్తిబాబు, ఆర్.ఆది, పేర్రాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలు ప్రారంభం

నక్కపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపమాక పంచాయతీ శివారు కొండవెనుకపాలెం గ్రామంలో నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ పి.వీరబాబు బుధవారం ఇంటింటికీ కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్నదే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నీటి సరఫరా ఎంత ముఖ్యమో.. నీటి సంరక్షణ, నీటి పొదుపు కూడా అంతే అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తోలేటి శ్రీను, యలమంచిలి చంద్రరావు, వాసు, కనకరాజు, కార్యదర్శి జయప్రకాశ్ పాల్గొన్నారు.

'రాజీవ్‌గాంధీ విగ్రహాలు పునరుద్ధరిస్తాం..'

పాయకరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు సత్యవరం గ్రామంలో పాడైన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాలను త్వరలో పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న తెలిపారు. బుధవారం ఈ విగ్రహాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని కొంతమంది దుండగులు ధ్వంసం చేశారనడంలో వాస్తవం లేదన్నారు. పార్టీతో సంబంధం లేని వ్యక్తులు పార్టీ నేతలుగా చెప్పుకుని చేస్తున్న తప్పుడు ప్రకటనలు ఎవరూ నమ్మవద్దన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతి నారాయణ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

తుమ్మపాలలో కొత్త పింఛన్ల పంపిణీ

తుమ్మపాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాలలో కొత్త పింఛన్లను బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి పంపిణీ చేశారు. పంచాయతీ ఈవో, కూటమి నాయకులు పాల్గొన్నారు.











జయ జయ హే మహిషాసురమర్దిని..

▸▸ వైభవోపేతంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


నూకాంబిక ఆలయంలో అమ్మవారికి పూజలు


కన్యకాపరమేశ్వరికి లక్ష బాదం పలుకులతో అర్చన

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అనకాపల్లి సతకంపట్టులోని కనకదుర్గమ్మ బుధవారం మహిషాసురమర్దినిగా, నిదానందొడ్డిలోని కామాక్షిదేవి భద్రకాళిదేవిగా దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి లక్ష బాదం పలుకులతో అర్చన చేపట్టారు. నూకాంబిక ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, ఊంజల్‌సేవ నిర్వహించారు. గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో అమ్మవారు నవదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అలాగే, మరిన్ని అమ్మవార్ల ఆలయాలు, మండపాల్లో విశేష పూజలు జరిపారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు : కలెక్టర్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీలో సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కల్పిస్తున్నాయని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. 84వ వార్డు ఎస్‌బీఐ కాలనీలో డీఆర్‌డీఏ, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు జీఎస్టీ తగ్గింపు వలన కలిగిన ఆర్థిక ప్రయోజనాలతో సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : సూపర్ జీఎస్టీతో పాడి రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. మార్టూరులో బుధవారం పాడి రైతులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అధికారులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ గౌతమ్ వర్మ, కుమారి, మార్టూరు సర్పంచ్ కరణం వెంకట సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ కాలనీ అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏఎంసీ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఇటీవల కూటమి నాయకులు భానుచందర్, బొద్దపు ప్రసాద్, మంగ ఈశ్వర్ చేసిన విజ్ఞప్తి మేరకు బుధవారం ఆయన జోనల్ కమిషనర్ చక్రవర్తితో పాటు సచివాలయ అధికారులతో కలిసి కాలనీని సందర్శించారు. అక్కడి సమస్యలు తెలుసుకుని కొన్నింటికి పరిష్కార మార్గం చూపారు. అపార్టుమెంట్‌లోని సెప్టిక్ ట్యాంకులు, మంచినీటి కుళాయిల మరమ్మతులకు రూ. 10లక్షలు మంజూరు చేశారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జడ్సీని ఆదేశించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. కాలనీవాసులు, కూటమి నాయకులు పిట్ల రాజు, బొమ్మల దేవి, పీలా నాగశ్రీను, ఆళ్ల రామచంద్రరావు, యల్లంకి సత్తిబాబు, దాడి జగన్, అప్పికొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

పరవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగవల్లుల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. సుమారు యాభైమంది మహిళలు హాజరై వివిధ ఆకృతుల్లో అందమైన ముగ్గులను వేశారు. పైలా కృష్ణవేణి, జి.దేవి, కోనేటి మౌనిక, చిరికి ఉమా, లాలం సునీతలు వరుసుగా ఒకటి నుంచి ఐదు స్థానాల్లో నిలిచారు. విజేతలకు గురువారం నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేస్తామని బొంకుల దిబ్బయూత్ ప్రతినిధులు గండి వాసు, పైలా అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా కార్మికులకు బోనస్ చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి

పరవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలో పనిచేస్తున్న కార్మికులకు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకుని 20 శాతం బోనస్ చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఫార్మాసిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అక్టోబరు నెల జీతంతో పాటు 20 శాతం బోనస్ కలిపి కార్మికులకు చెల్లించాలన్నారు. కొన్ని ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు బోనస్ చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికశాఖ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు గొల్లవిల్లి చిట్టిబాబు, కె.అప్పలరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.











'స్వదేశీ వస్తువులకు ప్రోత్సాహం అందరి బాధ్యత'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వదేశీ వస్తువులను అంతా కొనుగోలు చేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. వికసిత్ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఖాదీ సంతను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, పలకా రవి, కొణతాల అప్పలరాజు, పొన్నగంటి అప్పారావు, గంగుపాం నాగేశ్వరరావు పాల్గొన్నారు.





















మహిషాసుర మర్దినిగా అమ్మవార్లు

పాడేరురూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ దేవాలయాల్లో కొలువైన అమ్మవార్లు బుధవారం మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూర్ణపుష్కలాంబ అయ్యప్ప స్వామి ఆలయంలోని మహాలక్ష్మీదేవి, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి, కనకదుర్గమ్మ ఆలయం, మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవిని ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మహిషాసుర మర్దినిగా అలంకరించారు. వందలాది మంది భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలను చేపట్టారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి దేవికి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో అర్చకులు రామన్ పంతులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు.

అయ్యప్పస్వామి ఆలయంలోని మహాలక్ష్మి దేవిని మహిషాసుర మర్దినిగా వా సవీ మహిళా క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో అలంకరించారు. అనంతరం మహిళలు కుంకుమాభిషేకాలను నిర్వహించారు.

భక్తులకు ఉత్సవ నిర్వాహణ కమిటీ ప్రతినిధులు ప్రసాదాలను అందించారు. అలాగే, గురువారం నిర్వహించనున్న పట్టణంలో పలుచోట్ల దసరా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు, కమిటీ ప్రతినిధులు సీహెచ్.రమాదేవి, కె.రామారావు, కె.భాగ్యలక్ష్మి, వసంత, స్వాతి, జ్యోతి, సత్యవతి, కె.వెంకటరమణ, వి.రాజబాబు, ఆదిత్య, వర్మ, సత్తిబాబు, రొబ్బి రాము తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఏఎస్పీ

చింతపల్లి: స్థానిక రంగా సెంటర్‌లోని మండపం వద్ద దుర్గాదేవిని స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా దర్శించుకున్నారు. బుధవారం శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవి మండపంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏఎస్పీ పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.


మహిషాసుర మర్దినిగా రాజరాజేశ్వరి


ఉమా నీలకంఠేశ్వర ఆలయంలో రాజరాజేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు


దుర్గాదేవి పూజల్లో ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

విస్తృతంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల నేపథ్యంలో స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అడుగడుగునా మోహరించి విస్తృత వాహన తనిఖీలు చేపడుతున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిపై సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు అటుగా రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులకు పోలీసులు ప్రశ్నించి విడిచి పెడుతున్నారు. అలాగే మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, పెదబయలు, లక్ష్మీపురం, కుమడ తదితర ప్రాంతాలకు వెళ్లే మార్గం మధ్యలో పలు చోట్ల పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. సరిహద్దు ప్రాంతం మీదుగా ఒడిశా పోలీసులు ముమ్మర గాలింపులు చేపడుతున్నట్లు సమాచారం.

సారాతో ఒకరి అరెస్టు


సారా వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొయ్యూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి గ్రామ శివారున నాటు సారాతో ఒకరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపారు. సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారంపై బుధవారం తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆడాకుల గ్రామానికి చెందిన యల్లంకి చిన్న అప్పారావు వద్ద 10 లీటర్ల నాటు సారా లభించిందన్నారు. ఆయనను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సన్మానం


పదవీవిరమణ చేసిన డ్రైవర్‌ను సన్మానిస్తున్న డీఎం శ్రీనివాసరావు, తదితరులు

పాడేరురూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పాడేరు డిపోలో 38 ఏళ్లపాటు డ్రైవర్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన కోళ్ల నర్సింగరావుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు ఆ దంపతులను డీఎం శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఉద్యోగులు, సిబ్బంది, యూనియన్ నాయకులు, డ్రైవర్, కండక్టర్లు పాల్గొన్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. నిలిచిన విద్యుత్ సరఫరా


సీలేరు స్విచ్‌యార్డులో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతున్న జెన్‌కో సిబ్బంది

సీలేరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం సీలేరులో బుధవారం ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రం స్విచ్‌యార్డులో బుధవారం ఉదయం ఏడు గంటల సమయంలో పొటన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. దీంతో సీలేరు గ్రామానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే జెన్‌కో సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్త దానిని అమర్చి విద్యుత్ సరఫరాను మధ్యాహ్నం ఒంటిగంటకు పునరుద్ధరించారు.

కాశీపట్నం సంతలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు


వాహనాల నియంత్రిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది

అనంతగిరి, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం కాశీపట్నం వారపు సంతలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా స్థానిక డి.శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దసరా నేపథ్యంలో వ్యాపారులు భారీగా తరలిరావడం.. మరోవైపు అరకు- విశాఖ ప్రధాన రహదారిలో సంత జరుగుతుండడంతో వచ్చిపోయే వాహనాలకు రాకపోలకు అంతరాయం లేకుండా.. ఎక్కడికక్కడ పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. రోడ్డుకు దూరంగా వాహనాల నిలిపేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పర్యాటకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహన రికార్డులు, లైసెన్స్ లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జీఎస్‌టీ తగ్గింపుతో రైతులకు మేలు: ఏవో


వారపు సంతలో ర్యాలీ చేస్తున్న వ్యవసాయ అధికారులు, డీలర్లు

చింతపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రాలు, ఎరువులపై ప్రభుత్వం ఏడుశాతం జీఎస్‌టీ తగ్గినట్టు స్థానిక వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు అన్నారు. బుధవారం స్థానిక వారపు సంతలో వ్యవసాయశాఖ ఉద్యోగులు, ప్రైవేటు దుకాణాల డీలర్లు జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఎన్డీయే ప్రభుత్వం రైతులకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిందన్నారు. రైతులు జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జీఎస్‌టీ తగ్గింపు రైతులకు ప్రయోజనకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ల్యాబ్ ఏవో అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై 7న ‘చలో విజయవాడ’


పోరుబాట కరపత్రాలను ఆవిష్కరించిన ఫ్యాప్టో సంఘ నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న చేపట్టనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీనివాస్ కోరారు. ఫ్యాప్టో చైర్మన్ రావుల జగన్మోహనరావు అధ్యక్షతన బుధవారం స్థానిక గిరిజన ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి 30 శాతం తగ్గకుండా ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కలిగించాలని, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని, ప్లస్-2 పాఠశాలలో సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు వల్ల వెంకటరమణ, వి.మహేశ్, ఎస్.శేషగిరి, గిడ్డి వరలక్ష్మి, కె.ధనుర్జయ్, పి.కర్రన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు నిరసన


నిరసన ర్యాలీ చేపడుతున్న పీహెచ్‌సీ వైద్యులు

పాడేరురూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు పరిష్కరించేంత వరకు నిరసన కొనసాగిస్తామని వైద్యుల సంఘం జిల్లా నాయకులు స్పష్టం చేశారు. గిరిజన ప్రాంత పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల నిరసన కార్యక్రమం బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్లకార్డులతో నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ పరిధిలోని 64 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులకు జీవో 99ని రద్దు చేసి ఇన్సురెన్స్ కోటాను 30 శాతం, క్లినికల్ 50 శాతం, నాన్ క్లినికల్ అని డిపార్ట్మెంట్‌లో సీట్లు కల్పించాలన్నారు. వైద్యులకు 30 శాతం బేసిక్ పే ట్రైబల్ అలవెన్స్ కల్పించాలని, టైమ్ బౌండ్ పదోన్నతులు కల్పించాలి, నోషనల్ ఇంక్రిమెంట్ కల్పించాలన్నారు. చంద్రన్న సంచార చికిత్స అలవెన్స్ రూ. 4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక శివాలయం వేదపండితుడు సాయి శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆరుగురు దంపతులతో అట్టహాసంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎంవీవీ ప్రసాద్ దంపతులు, అనిశెట్టి చిరంజీవి, సర్పంచ్ మాకాడ బాలరాజు, వెండిబోయిన చక్కరావు, ముప్పడి వీర్రాజు, నాగదొర, అనిమిరెడ్డి శివ, సాగిన సాయి, తేజ, రమణి, గ్రామస్థులు పాల్గొన్నారు.


కొయ్యూరులో శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన

అరకులోయ, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండల పరిధి గుమ్మకోట పంచాయతీ పరిధిలో హైడ్రో పవర్‌ప్రాజెక్టు నిర్మాణం వద్దని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం అరకులోయ మండలం సరిహద్దులోని ఇరగాయి పంచాయతీలో మొర్రిగుడ, ఇరగాయి గ్రామాల్లో ఏర్పాటుచేసిన హైడ్రో పాజెక్టుకు సంబంధించిన సర్వే దిమ్మలను బుధవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేకపోరాట కమిటీ నేత లోతేరు కొర్రాస్వామి, ఆది వాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ, హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన జీవో 13ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరగాయి సర్పంచ్ మాదల నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యుడు నెబో, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహనరావు, సీపీఎం నేత రామారావు, పెసా కమిటీ నాయకులు బురిడి నరసింగరావు, బురిడి విజయ్, అధిక సంఖ్యలో పలు గ్రామాల గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన కల్వర్టుతో అవస్థలు

పెదబయలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోమంగి పంచాయతీ కుమ్మరి వీధి ప్రధాన రహదారిపై శిథిలావస్థకు చేరిన లంకగెడ్డపై కల్వర్టు స్థానంలో హై లెవెల్ వంతెనను నిర్మించాలని గోమంగి మండల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. వర్షాలకు కోతకు గురైన ఈ కల్వర్టును వారు బుధవారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కల్వర్టు దెబ్బతిని వాహనాలు తిరగలేని స్థితి నెలకొందన్నారు. ఈ మార్గంలో 10 పంచాయతీ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ప్రస్తుతం కల్వర్టు కోతకు గురవడంతో చుట్టూ తిరిగి 30 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి పెదబయలు, ముంచంగిపుట్ట మండలాలకు చేరుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ కల్వర్టు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్స్ ఆ మార్గంలో ప్రయాణించటానికి వీలు లేక రోగులను నడిపించుకుని ఆస్పత్రికి తీసుకువెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన కల్వర్టు స్థానంలో హై లెవెల్ వంతెన నిర్మించి ఆ ప్రాంత గిరిజనులకు రవాణా కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంత పద్మనాభం, రాధాకృష్ణ, బాలరాజు, టక్కర్ తదితరులు పాల్గొన్నారు.


కోతకు లోనైన కల్వర్టును పరిశీలిస్తున్న నాయకులు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పాడేరురూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): పాడేరు మేజర్ పంచాయతీలోని పి.గొందూరు గ్రామంలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు పాల్గొన్నారు కొత్తగా పింఛన్ మంజూరైన సమరెడ్డి అప్పలకు రూ. 4 వేలు ఆయన ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడుతో కలిసి అందించారు. ఈ సందర్భంగా తాగునీటి, వీధి దీపాల సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి కొత్త పైప్‌లైన్‌లు వేస్తామని, బోర్ల మరమ్మతులను ఈ నెలాఖరుకు పూర్తయ్యేలా చూస్తానని సుబ్బారావు హామీ ఇచ్చారు. వారంల్లోగా వీధి దీపాల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అలాగే, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో వెంకటలక్ష్మి, సచివాలయ వెల్ఫేర్ అధికారి బండారు రమేశ్, వర్తన లక్ష్మణ్, వసంత తదితరులు పాల్గొన్నారు. మెయిన్ బజారు, మసీద్ వీధిలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేశ్ కుమార్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి, అప్పారావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్రపాలెంలో పింఛన్ల పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో బుధవారం మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలుతో ముందంజలో ఉందని ఎంవీవీ ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె చంద్రరావు, రాజేంద్రపాలెం, కొయ్యూరు సర్పంచ్‌లు పీట సంహాచలం, ఎం బాలరాజు, మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో కాఫీలో అధిక దిగుబడులు

» కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ప్రభాకరరావు

చింతపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు కాఫీ ఉత్పత్తిలో శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని కేంద్ర కాఫీ బోర్డు (వాణిజ్య విభాగం) సభ్యుడు జైతి ప్రభాకరరావు అన్నారు. బుధవారం స్థానిక కేంద్ర కాఫీ బోర్డు కార్యాయంలో అంతర్జాతీయ కాఫీ దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందన్నారు. ఆదివాసీ రైతులు సాగు చేసిన కాఫీ గింజలను కొనుగోలుకు దేశ, విదేశీ వర్తకులు పోటీపడుతున్నారన్నారు. రైతులు కాఫీ ఉత్పత్తిలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడంతోపాటూ గరిష్ఠ ధర పొందుతారన్నారు. కాఫీ తోటల్లో వివిధ సీజన్లలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. రైతులు కాఫీ పండ్లను సేకరించి పార్చిమెంట్‌గా తయారు చేసి విక్రయించుకోవాలన్నారు. కేంద్ర కాఫీ బోర్డు అంతర్జాతీయ ధరలను రైతులకు తెలియజేసేందుకు కృషితరంగా ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆయన చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు జేఎల్‌వో రవి కుమార్, శాస్త్రవేత్త సునీల్ బాబు పాల్గొన్నారు.

‘స్త్రీశక్తి పథకం విజయవంతం ఆర్టీసీ ఉద్యోగుల బాధ్యత’


ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసరావు

పాడేరురూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం విజయవంతానికి ఆర్టీసీ ఉద్యోగులు కృషి చేయాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు కోరారు. బుధవారం డిపోలో డ్రైవర్, కండక్టర్లకు నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సిబ్బంది ప్రయాణీకులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ప్రమాదాలు లేకుండా బస్సులను నడపాలని, విధులకు సకాలంలో హాజరుకావాలని సూచించారు. కండక్టర్లు ప్రస్తుతం స్త్రీ శక్తి టికెట్ ఇచ్చే విధానంలో యూటీఎస్ టిమ్‌లలో అవసరమైన మార్పు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ పథకాలు, విధానాలపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కచ్చితమైన తూకంతో రేషన్ సరకులు సరఫరా చేయాలి

» జీసీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బౌడు రామారావు

చింతపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఆర్ డిపోలకు గోడౌముల (ఎంఎల్ఎస్ పాయింట్) నుంచి కచ్చితమైన తూకంతో రేషన్ సరకులు పంపించాలని గిరిజన సహకార సంస్థ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు బౌడు రామారావు డిమాండ్ చేశారు. బుధవారం సేల్స్‌మన్, డీలర్లు, ఎస్‌హెచ్‌జీ సేల్స్‌మన్‌లు స్థానిక తహసీల్దార్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈనెల నుంచి లబ్ధిదారులకు రేషన్ పూర్తి స్థాయి ఆన్‌లైన్ విధానంలో పంపిణీ చేస్తున్నారన్నారు. లబ్ధిదారులందరికీ పారదర్శకంగా కచ్చితమైన తూకానికి సరకులు అందజేయాలన్నారు. ఈ మేరకు గోదాము(ఎంఎల్ఎస్ పాయింట్) నుంచి రేషన్ సరకులు తూకం చేసి డిపోలకు పంపించాలన్నారు. ప్రతి నెల 25తేదీలోగా సరకులు డిపోలకు తరలించాలన్నారు. ప్రతి డీఆర్ డిపోలకు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పొట్టుకూరి నెహ్రూబాబు కార్యదర్శి జరుగుడు రాంబాబు, నాయకుడు కుడుముల వెంకట రమణ, రాజా, మల్లుపడాల్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేస్తున్న జీసీసీ ఉద్యోగులు

గిరిజన ఉద్యోగ సంఘ ఎన్నికకు అధికారుల నియామకం


సమావేశంలో పాల్గొన్న గిరిజన ఉద్యోగులు, ఎన్నికల అధికారులు

పాడేరురూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ సర్వ సభ్య సమావేశం స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఉద్యోగుల సంఘం పదవీ కాలం ఈ గత నెల 29వ తేదీతో ముగియడంతో సంఘ నూతన కార్యవర్గ ఎన్నికకు సంబంధించి 15 మంది ఎన్నికల అధికారులను నియమించినట్టు ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ చైర్మన్ పలాసి కృష్ణారావు తెలిపారు. అలాగే, ఈ నెల 5వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో అన్ని శాఖల్లో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులతో సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు జీవీవీ ప్రసాద్, ఆర్.ధర్మన్న, కె.రామ్మూర్తి నాయుడు, మర్రి చిన్నయ్య, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

పాడేరురూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా నాయకుడు లకే నానిపాత్రుడుమాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగంలో చేరి ఆరేళ్లు పూర్తయినా తమకు ఎటువంటి ప్రమోషన్ ఛానల్, డ్యూటీ చార్ట్ లేవన్నారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాల్సి ఉందన్నారు. డోర్ టు డోర్ సర్వేల నుంచి విముక్తి కలిగించి బదిలీల్లో పారదర్శకతతో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పి.సత్యవతి, సింహాచలం, నరేశ్ పాల్గొన్నారు.


నల్ల బ్యాడ్జీలు ధరించి పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

220 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

పాడేరురూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలంలో మంగళవారం 220 కిలోల గంజాయితో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్ స్థానిక కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ జరిపినట్టు చెప్పారు. ఈ క్రమంలో పెదబయలు పోలీసులకు గంజాయి పట్టుబడినట్టు చెప్పారు. నిందితులను అరెస్టు రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సీఐ, పెదబయలు ఎస్ఐ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ షెహబాజ్

మహిషాసుర మర్దిని అలంకరణలో దుర్గమ్మ



నర్సీపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం విజయదశమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అబిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ జంప నాగేంద్రరాజు తెలిపారు.

పెన్సిల్ ముల్లుపై దుర్గాదేవి రూపం





పెన్సిల్ ముల్లుపై దుర్గమ్మ రూపం... (ఇన్‌సెట్‌లో) గోపాల్

మాడుగుల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా పెన్సిల్ ముల్లుపై దుర్గాదేవి రూపాన్ని చెక్కి మరోసారి కళా నైపుణ్యాన్ని చాటుకున్నాడు ఎం.కోడూరు గ్రామానికి చెందిన మైక్రోఆర్టిస్ట్ నైదండ గోపాల్. ప్రత్యేక సందర్భాల్లో ఎన్నో సూక్ష్మ కళాఖండాలు గోపాల్ తయారు చేశాడు. ఈ క్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం సన్నపాటి బ్లేడు ఉపయోగించి బూతద్దం సాయంతో రెండు గంటలు శ్రమించి దుర్గమ్మ రూపం పెన్సిల్ ముల్లుపై అద్భుతంగా చెక్కి, వాటర్ కలర్స్ అద్దాడు. గోపాల్ ప్రతిభను పలువురు అభినందించారు.





చోడవరం: పీఎస్ పేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు... మాడుగుల: అవురువాడలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

త్వరలో అర్హులందరికీ పింఛన్లు: ఎమ్మెల్యే రాజు

చోడవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ త్వరలోనే పింఛన్లు మంజూరవుతాయని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని పీఎస్ పేట గ్రామంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పింఛన్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అర్హత కలిగిన వారందరికీ త్వరలో మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, సర్పంచ్ బండి నూకాలమ్మ, నాయకులు సకురు కోటేశ్వరరావు, ఎర్రంశెట్టి చిన్న, డీవీ అప్పారావు, పప్పు శ్రీను, మల్లిబాబు, ముడుసు గోవింద్, బీరా రామకృష్ణ, శ్రీనివాసరావు, కొల్లు కోటేశ్వరరావు, బి.లక్ష్మణరావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల్లో 90 శాతం పూర్తి: హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల

బుచ్చెయ్యపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో 90 శాతం అమలు చేసినట్టు రాష్ట్ర హౌసింగ్ బోర్డు చెర్మన్ బత్తుల తాతయ్యబాబు చెప్పారు. మండలంలో వడ్డాది గ్రామంలో బుధవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సీఎం చంద్రబాబు తీసుకువెళ్తున్నారని చెప్పారు. అలాగే ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ జి.సత్యనారాయణ, ఎంపీడీవో శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండంలోని అవురువాడ గ్రామంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను దశల వారీగా ఒక్కొక్కటి నెరవేరుస్తున్నదని చెప్పారు. ప్రజా శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేశ్ కూటమి నాయకులు జగ్గారావు, దేముడు, చక్రవర్తి రాజు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



వడ్డాదిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న బత్తుల తాతయ్యబాబు, నాయకులు

నేడు మాంసం విక్రయాలు నిషేధం

నర్సీపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మునిసిపాలిటీ పరిధిలో గురువారం మాంసం, చేపల విక్రయాలు నిషేధించినట్టు కమిషనర్ జంపా సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పీహెచ్‌సీలో పుట్టిన రోజు వేడుకలు!

- గంటకుపైగా రోగులను పట్టించుకోని వైద్య సిబ్బంది



ఆస్పత్రిలో వేచివున్న రోగులు... (ఇన్‌సెట్‌లో) పీహెచ్‌సీ భవనం

చోడవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల కోసం వచ్చిన రోగులను పీహెచ్‌సీ సిబ్బంది పట్టించు కోకుండా, ఒక ఉద్యోగి పుట్టిన రోజు వేడుకల్లో మునిగిపోయారు. సుమారు గంట పాటు ఓపీ చీటీలు జారీ చేయలేదు. మందులు సైతం ఇవ్వలేదు.

మండలంలోని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య సిబ్బందిలో ఒకరి పుట్టిన రోజు కావడంతో, బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఆస్పత్రిలోనే మిగిలిన సిబ్బంది బర్త్ డే వేడుకలు నిర్వహించారు. అందరూ ఒక గదిలోకి వెళ్లి కేక్ కట్ చేసి, ఫొటోలు తీసుకోవడంలో మునిగిపోయారు. ఈ సమయంలో మహిళా వైద్యాధికారి (ఆందోళనలో భాగంగా పీహెచ్‌సీల వైద్యులు విధులకు రాకపోవడంతో చోడవరం సీహెచ్‌సీని ఒక డాక్టర్‌ను గవరవరం పంపారు) తన ఛాంబర్‌లో వున్నారు. కానీ ఓటీ చీటీలు ఇచ్చే వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు డాక్టర్ వద్దకు వెళ్లలేకపోయారు. రోగులు పిలుస్తున్నప్పటికీ వైద్య సిబ్బంది పట్టించుకోలేదు. పైగా గంట పాటు ఆగాలంటూ పుట్టిన రోజు వేడుకల్లో మునిగిపోయారు. ఆస్పత్రిలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఏమిటంటూ రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో ఈ వేడుకలు జరుపుకుంటూ ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు కదా అని అన్నారు. సుమారు గంటపాటు పుట్టిన రోజు వేడుకల్లో మునిగిపోయి, రోగులను పట్టించుకోని సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ డిపో ఏర్పాటుకు కృషి: తహశీల్దార్

దేవరాపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి గ్రామంలో ప్రత్యేక రేషన్ డిపో ఏర్పాటుకు కృషి చేస్తామని తహశీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు. డిపో కోసం గిరిజనులు చేసిన నిరసనపై తహశీల్దార్ స్పందించారు. ఈ మేరకు బుధవారం సీఎస్‌డీటీతో కలిసి గ్రామానికి వెళ్లి గిరిజనులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణరాజు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

కోనాం నీరు విడుదల

చీడికాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు. తుఫాన్ వర్షాలతో జలాశయంలోకి వరదనీరు అధికంగా వచ్చి చేరుతున్నదని చెప్పారు. గరిష్ఠ నీటి మట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.80 మీటర్లకు చేరిందన్నారు. ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు కాగా, 300 క్యూసెక్కులను దిగువ గేటు ద్వారా విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు.

తిరుమల మాడవీధులలో నర్సీపట్నం మహిళల కోలాటం

నర్సీపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాడ వీధుల్లో నర్సీపట్నం, మాకవరపాలెం మహిళలు రాధాకృష్ణుల వేషధారణలో కోలాటం ఆడారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా చుండూరు పరమేశ్వర శర్మ, శిరీష దంపతుల ఆధ్వర్యంలో శ్రీసంకీర్తన భజన మండలి శిష్య బృందంతో మాధవీధులలో గజ వాహనం, సూర్య ప్రభ వాహనంలో వేంచేసి ఉన్న మలయప్పస్వామి ఎదుట వారు ఈ పదర్శన ఇచ్చారు.

జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన

చోడవరం/నర్సీపట్నం/నాతవరం/కె.కోటపాడు/రావికమతం/చీడికాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులకు చేకూరే ప్రయోజనాలపై బుధవారం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. చోడవరంలోని రాయపురాజుపేటలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సర్పంచ్ రామునాయుడు, కార్యదర్శి నారాయణరావు పాల్గొన్నారు. నర్సీపట్నంలో తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ వర్తకులతో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. నిత్యావసర సరకులు విక్రయించే హోల్‌సేల్ వర్తకులు జీఎస్టీ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ మార్చుకోవాలని ఆమె సూచించారు. నాతవరం తాండవ ప్రాజెక్టు ఛైర్మన్ సత్యనారాయణ జీఎస్టీ తగ్గింపులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో సత్యశ్రీనివాసు, ఎంఈవో కె.వరహాలబాబు, ఏవో సుగుణ, కార్యదర్శి సత్యనారాయణ, టీడీపీ నేతలు ఎస్.వెంకటరమణ, పి.సాయి, కొంద్రు మరిడియ్య, నానిబాబు పాల్గొన్నారు. కె.కోటపాడులో ఏవో సోమశేఖర్ వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ స్లాబులను వివరించారు. పీఏసీఎస్ సీఈవో రొంగళి ఈశ్వరరావు, కార్యదర్శి శ్రీను, వీఏఏ హరీష్ పాల్గొన్నారు. రావికమతంలోని చినపాచిల గ్రామంలో ఏవో రమేష్‌బాబు జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరావు, ఎంపీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు. చీడికాడ లోని జైతవరం, ఖండివరం గ్రామాల్లో పశు వైద్యాధికారి గణేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మావతి ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సర్పంచులు ఎస్.లక్ష్మి, సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు ముత్యాలనాయుడు, జి.స్వాతి, మాజీ ఎంపీపీ కె.కళావతి, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ



బాధితులకు చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

నర్సీపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పాలకలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ద్వారపూడి త్రిమూర్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి పార్టీ అండగా నిలిచింది. బుధవారం పార్టీ తరఫున 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రమాద బీమా రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడిగర్ల నానిబాబు, పాకలపాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ సారె ఊరేగింపు



కనకదుర్గమ్మ సారెతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నాతవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శక్తిపంచాయతన ఆలయ ప్రాంగణంలో కనకదుర్గమ్మకు బుధవారం మహిళలు వివిధ రకాల పిండి వంటకాలతో సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అన్నసంతర్పణ నిర్వహించారు. దసరా రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ సతీశ్ తెలిపారు.

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట శివారు కొత్తూరు గ్రామదేవత పైడిమాంబకు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రజలు సారెను సమర్పించారు. భక్తులు వివిధ రకాల పిండి వంటలు తయారు చేసి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సర్పంచ్ వెంకటరావు, మాజీ సర్పంచ్ శంకరరావు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట హెచ్‌సీ దీనబంధు మృతి



కృష్ణాదేవిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కిల్లో దీనబంధు (45) మంగళవారం రాత్రి విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనబంధు మృతిపై ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సిబ్బంది, కృష్ణాదేవిపేట గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు. దీనబంధు స్వగ్రామం అల్లూరి జిల్లా అన్నవరం. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జానకిరాంపురం పీఏసీఎస్‌కు చేయూత అందించాలి

రోలుగుంట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నష్టాల్లో ఉన్న జానకిరాంపురం పీఏసీఎస్‌కు చేయూత అందించాలని ఛైర్‌పర్సన్ బలిజ మహారాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సొసైటీపై ప్రత్యేక దృష్టిసారించాలని, రైతులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై ఛైర్మన్ సానుకూలంగా స్పందించాలరని మహారాజ్ తెలిపారు.

కొత్తూరులో బోనాల ఊరేగింపు



కొత్తూరులో కలశాలతో ఊరేగుతున్న భక్తులు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామంలో బుధవారం బోనాలను ఘనంగా ఊరేగించారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా సుమారు 250 కలశాలతో మహిళలు భక్తి గీతాలు, సంకీర్తనలు ఆలపిస్తూ వీధులలో ఊరేగింపుగా సాగారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యురాలు కాండ్రేగుల ధనలక్ష్మి, వసుంధర, నాగేశ్వరరావు, చిట్టిబాబు, శ్రీనువాసరావు, సమరసతా ఫౌండేషన్ సభ్యులు నీలాపు వెంకటరెడ్డి, కట్టా వీరబాబు, వర్మ, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గెడ్డపాలెంలో ఘటాలతో...



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఎస్.రాయవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం భవానీ భక్తుల సమక్షంలో దుర్గాదేవి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఘటాలు ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో దేవి నామస్మరణ చేస్తూ అన్ని వీధిల్లోనూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. దీంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది.

నక్కపల్లిలో సారె...



నూకాంబిక అమ్మవారికి సారె సమర్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు, భవానీ దీక్షాపరులు పురవీధుల్లో సారెతో ఊరేగారు. అనంతరం నూకాంబిక అమ్మవారి ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కోటవురట్లలో...



కోటవురట్ల. అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టివాడ గ్రామంలో బుధవారం దుర్గమ్మకు భక్తులు సారె సమర్పించారు. మండలంలోని కైలాసపట్నం, పాములవాక, గొట్టివాడ కోటవురట్ల, జల్లూరు, బీకేపల్లి, పందూరు, రాజుపేట, చౌడువాడ గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలు ఏర్పాటుచేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు.

మడుతూరులో దుర్గమ్మకు సారె సమర్పణ



అమ్మవారి సారెను ఊరేగిస్తున్న భక్తులు

అచ్యుతాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మడుతూరులో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాతకు బుధవారం సారెను సమర్పించారు. భక్తులు తమ ఇళ్లలో వివిధ రకాల పిండివంటలను తయార చేయించి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

» అధికారుల సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్



దుర్గమ్మ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై ఎస్పీ, జేసీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూగర్భ జలాలు తక్కువగా గల 130 గ్రామాల్లో నీటి మట్టం పెంపునకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇక్కడ నీటి పారుదల, డ్వామా, భూగర్భజల శాఖల అధికారులతో రిజర్వాయర్లు, మీడియం, మైనర్ జలాశయాల్లో ప్రస్తుత నీటిమట్టం, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలన్నారు. చెరువులు, కాలువల్లో పూడికతీత పనులను వ్యక్తిగతంగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానంగా జలాశయాలు, చెరువులు ఆక్రమణలకు గురికాకుండాచూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈ ఎ.త్రినాథ్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి, భూగర్భ జల శాఖ అధికారి శోభ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి

అనకాపల్లి కలెక్టరేట్ : శరన్నవరాత్రి ఉత్సవాలు పూర్తయిన నేపథ్యంలో జిల్లాలో అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ ఎం.జాహ్నవిలతో కలిసి పోలీస్, రెవెన్యూ, గ్రామ పంచాయతీ, మత్స్యశాఖ, మండల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విగ్రహాల నిమజ్జన సమయాల్లో తీర ప్రాంత మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ గురువారం గాంధీజయంతి సందర్భంగా జిల్లాలో మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయీషా, జిల్లా దేవదాయశాఖ అధికారి సుధారాణి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

'జీఎస్టీ సంస్కరణలతో వ్యవసాయ, పాడి రంగాలకు ఊతం'



పెదనాయుడుపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, తదితరులు

సబ్బవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని పెదనాయుడుపాలెంలో బుధవారం రైతులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. జీఎస్టీలో సంస్కరణల వల్ల రైతులకు ఎంతో మేలుగా పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు మరింత ఊతం ఇచ్చేందుకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్‌లపై ఉన్న 12 శాతం జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం ఐదు శాతం చేసిందన్నారు. అదే విధంగా అంతకాపల్లిలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఏఏ వస్తువులపై జీఎస్టీ ఎంత మేర తగ్గుతుందో వివరించారు. ఎంపీడీవో పి.పద్మజ, ఏవో పోతల సత్యనారాయణ, డాక్టర్ ఉషాకుమారి, డాక్టర్ అరుణ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ గౌతమ్‌వర్మ, పోతల కనకరాజు, పల్ల తాతారావు, కొరాడ శ్రీను, కేవీ సత్యనారాయణ, కొటాన అప్పారావు, ఏఈవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్



లాలంకోడూరులో పింఛన్ల పంపిణీలో ప్రగడ నాగేశ్వరరావు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 84వ వార్డు పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. కాలనీ శివారులో గల సేనాపతి మహాలక్ష్మి ఇంటికి వెళ్లి సామాజిక పరిస్థితిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వారి పరిస్థితిని చూసి చలించిన కలెక్టర్ వారికి ఇల్లు మంజూరుకు గల అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు పంపించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల అధికారిణి మంజులావాణి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, ఏపీడీ సంతోశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, 81వ వార్డులో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, 84వ వార్డులో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

లాలంకోడూరులో....

రాంబిల్లి :మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ బుధవారం పండుగ వాతావరణంలో సాగింది. లాలంకోడూరులో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాంబిల్లి మండల శాఖ అధ్యక్షుడు లాలం భరత్, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు పించన్లను పంపిణీ చేశారు. హరిపురంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు పింఛన్ నగదును అందించారు.

హాకీ టోర్నీ విజేత 'ధ్యాన్‌చంద్ హాకీ క్లబ్'



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జనసేన నేతలు బొద్దపు శ్రీను, పిట్టా శ్రీను

ఎలమంచిలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడి రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన హాకీ టోర్నీ బుధవారం ముగిసింది. ఆరు జట్లు ఉత్సాహంగా తలపడ్డాయి. ఫైనల్స్‌లో మన్‌ప్రీత్ హాకీ క్లబ్‌పై 5-2 గోల్స్ తేడాతో ధ్యాన్‌చంద్ హాకీ క్లబ్ విజయం సాధించింది. బెస్ట్ ప్లేయర్‌గా బి.శివ నిలిచారు. విజేతలకు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, సీనియర్ నేత పిట్టా శ్రీను బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాకీ క్రీడకు ఎలమంచిలి పుట్టినిల్లుగా పేర్కొన్నారు. క్రీడాకారులు మ రింతగా శ్రమించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. హాకీ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ కొఠారు నరేష్, సీనియర్ క్రీడాకారులు జీవీ రెడ్డి, డి.మహేష్, దుర్గారావు పాల్గొన్నారు.

'ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు'



రేగుపాలెంలో పెన్షన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్, టీడీపీ నాయకుడు సన్యాసినాయుడు

ఎలమంచిలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని రేగుపాలెంలో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడులతో కలిసి పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేస్తున్నట్టు చెప్పారు. జీఎస్టీలో ప్రధాని మోదీ చేపట్టిన సంస్కరణలతో ప్రజలందరికీ మేలు చేకూరుతుందన్నారు. అలాగే, మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, యర్రవరంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కరణం రవికుమార్, పెదపల్లి వార్డులో పట్టణ ఉపాధ్యక్షుడు దంట్ల వెంకట స్వామి పించన్లను పంపిణీ చేశారు.

మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి



మహిషాసురమర్దిని అలంకరణలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారి

ఎలమంచిలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం కన్యకాపరమేశ్వరీ అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయ ప్రాంగణంలో వాసవీ మహిళలు దేవతామూర్తులతో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు శూలాల మహోత్సవం

మునగపాక : ఇక్కడి వేపచెట్టు ప్రాంతంలో గల గౌరమ్మ ఆలయంలోని దుర్గాదేవి పీఠంలో గురువారం దసరా ఉత్సవంలో భాగంగా మొక్కు శూలాల మహోత్సవం జరగనుంది. రాత్రి ఏడు గంటలకు జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఈ వేడుక ప్రారంభమై పురవీధుల గుండా పీఠం వరకు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు : డీఎస్పీ



వాహనాల రాకపోకలను పరిశీలిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

లంకెలపాలెం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ వాహనదారులను హెచ్చరించారు. లంకెలపాలెం కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న పలు వాహనాల యజమానులకు జరిమానా విధించారు. పరిమితికి మించి సరకు రవాణా చేయవద్దని పలువురు డ్రైవర్లకు సూచించారు. ఆయన వెంట సీఐ మల్లికార్జునరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా వంశీదీప్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ముఖ్య అతిథులు

సబ్బవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ తనయుడు వంశీదీప్ జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి మొగలిపురంలో ఘనంగా జరిగాయి. జీవీఎంసీ కార్పొరేటర్లు సేనాపతి శంకరరావు, బల్ల శ్రీనివాసరావు, అవుగడ్డ అప్పలనాయుడు, మాసవరపు అప్పలనాయుడు, పరవాడ మాజీ జడ్పీటీసీ పైల జగన్నాథరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గండి దేముడు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశీదీప్ మరిన్ని జన్మదిన వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు అవుగడ్డ అప్పలనాయుడు, కస్నూరి వెంకటరమణ, అంగటి నానాజీ, వియ్యపు చిన్నా, బొండా కళ్యాణ్, బంగారునాయుడు, బలిరెడ్డి అప్పారావు, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

చోడవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండో కిలోల గంజాయితో ఒకరిని అరెస్టు చేసినట్టు సీఐ బి.అప్పలరాజు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట మెయిన్ రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వడ్డాది వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి లభించింది. ఇతను గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన దస్తగిరిగా గుర్తించారు. సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు.

పీహెచ్‌సీల వైద్యులు ధర్నా



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ధర్నాలో కూర్చున్న పీహెచ్‌సీల వైద్యులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద (డీఎంహెచ్‌వో ఆఫీస్) వద్ద పీహెచ్‌సీ వైద్యులు బుధవారం ధర్నా చేశారు. రెండు రోజులుగా ఓపీ సేవలు నిలిపివేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద వైద్యులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ఎస్.ఎస్తేరురాణి, ఎస్.తిరుపతిరావు, ఆర్. వెంకటేశ్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ విజయదశమి శుభాకాంక్షలు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అన్నింటిలో విజయాలు సాధిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆనందంగా దసరా పండుగ జరుపుకోవాలన్నారు.

'పీఎం వయోవందన'తో వృద్ధులకు మేలు

» డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి



కశింకోట పీహెచ్‌సీలో వృద్ధులతో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌వో హైమావతి

కశింకోట, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి వయోవందన కార్డులను 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ హైమావతి కోరారు. బుధవారం ఆమె కశింకోట పీహెచ్‌సీని సందర్శించి మాట్లాడారు. వృద్ధులంతా చక్కగా తగినంత ఆహారం తీసుకుని ఆనందంగా గడపాలన్నారు. అనంతరం వైద్య సేవల నిమిత్తం వచ్చిన వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అంతకు ముందు ఆమె వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

చెక్కపై త్రిశూలంతో అమ్మవారు

» అద్భుతంగా బాపూజీ రూపం



చెక్కపై త్రిశూలంతో అమ్మవారు, బాపూజీ రూపాన్ని చెక్కిన దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి విజయదశమి, బాపూజీ జయంతిని పురస్కరించుకుని తయారు చేసిన కళా రూపాలు ఆకట్టుకున్నాయి. ఒక చెక్కపై త్రిశూలంతో పాటు అమ్మవారి రూపాన్ని చెక్కాడు, అలాగే మరో చెక్కపై గాంధీజీ రూపాన్ని తీర్చిదిద్దాడు.

వరిపై సుడిదోమ దాడి!

... 7వ పేజీ తరువాయి

ఎండిపోయినట్టు కనిపిస్తాయి.


సుడిదోమ, తెల్లవీపుమచ్చ దోమ ప్రారంభ దశలో వుంటే ఎకరాకు ఎసిఫేట్ 75 ఎస్‌పీ మందు 250 నుంచి 300 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ లేదా ఎథిప్రోల్ 80 డబ్ల్యూజీ 50 గ్రాముల మందును 200 నుంచి 250 లీటర్ల నీటిలో కలిపి ఆకులు, దుబ్బులు తడిచేలా పిచికారీ చేయాలి. దోమ ఉధృతి అధికంగా వుంటే లీటరు నీటికి పైమెట్రోజైన్ 50 డబ్ల్యూజీ 0.6 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 50 ఎస్‌జీ 0.4 గ్రాములు లేదా డైనోటెఫ్యూరాన్ 20ఎస్‌జీ 0.4 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నీటి పూర్తిగా తీసివేసి, సాయంత్ర సమయంలో మందు నీటిని పిచికారీ చేయడం మంచిది. తొలుత గట్లను ఆనుకొని పైరుపై మందు నీటిని పిచికారీ చేయడం ప్రారంభించి తరువాత బొంగరం తరహాలో లోపలి వైపునకు పిచికారీ చేసుకుంటూ వెళ్లాలి. సుడిదోమ, తెల్లవీపుమచ్చ దోమ ప్రభావం లేని పొలాల్లో కూడా ముందు జాగ్రత్తగా వేపనూనె లేదా నీమాస్త్రం ఒకసారి పిచికారీ చేసుకోవడం మంచిది. దోమ ఉధృతికి దోహదపడే క్వినాల్‌ఫాస్, ప్రొఫినోఫాస్, మిథైల్ పరాథియాన్, ట్రైజోఫాస్, ఫోరెట్ 10 జీ గుళికలు, సింథటిక్ పైరిత్రాయిడ్ వర్గానికి చెందిన డెల్టామెత్రిన్, సైపర్మెత్రిన్ వంటి పరులు మందులు వాడకూడదు.

ఈదురు గాలులతో భారీ వర్షం

... 7వ పేజీ తరువాయి

ఒరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రంగంలో దిగిన ఈపీడీసీఎల్ సిబ్బంది చెట్లను తొలగించి విద్యుత్ వైర్లను సరిచేశారు.

మరోసారి నిండిన కల్యాణపులోవ



రావికమతం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం మరోసారి గరిష్ఠ స్థాయికి చేరింది. ఎగువనున్న ఏజెన్సీ ప్రాంతం నుంచి 250 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. పూర్తిస్థాయి నీటిమట్టం 460 అడుగులు కాగా, బుధవారం 458.6 అడుగులకు చేరడంతో స్పిల్‌వేలో రెండు గేట్లను ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నట్టు ప్రాజెక్టు ఏఈ డి.సూర్య తెలిపారు. రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో నది పక్కన వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524